క్లుప్తంగా

కృష్ణమహంతి చెరువుకు మహర్దశ



నాతయ్యపాలెం గ్రామ నాయకులతో చర్చిస్తున్న కాకి గోవిందరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెంలో గల కృష్ణమహంతి చెరువు అభివృద్ధి పనుల్లో భాగంగా ఆదివారం గ్రామ నాయకుల ఆధ్వర్యంలో సర్వే పనులు చేపట్టారు. ఈ సందర్భంగా చెరువు సరిహద్దు, అభివృద్ధి ప్రణాళికపై గ్రామ నాయకులతో వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి సమాలోచన చేశారు. కార్యక్రమంలో పలువురు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

వేడుకగా దేవస్నాన పూర్ణిమ పూజలు



భక్తుల పూజలు అందుకుంటున్న జగన్నాథుడు

ఉక్కునగరం: సెక్టార్-9లోని పూరి జగన్నాథ స్వామి దేవాలయంలో ఆదివారం దేవ స్నాన పూర్ణిమ పూజలు ఘనంగా జరిగాయి. జ్యేష్ఠ మాసంలో జరిగే జగన్నాథ స్వామి రథయాత్రకు 15 రోజుల ముందు ఆలయంలో ఈ పూజలు ప్రత్యేకంగా చేస్తారు. ఆ తర్వాత జగన్నాథుని రథయాత్ర చేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా 108 కుండల నీటితో దేవతల విగ్రహాలకు స్నానం చేయిస్తారు. అనంతరం విగ్రహాలను ఏనుగు అవతారంలో అలంకరిస్తారు. అంతకు ముందు స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) బీకే మొహంతి సతీసమేతంగా హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్కల్ సేవా సంఘం ప్రతినిధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



వాకర్స్ క్లబ్ సారథ్యంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

అగనంపూడి: అగనంపూడి వాకర్స్ క్లబ్ సారథ్యంలో వాకర్స్‌కు మజ్జిగ పంపిణీ చేశారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా క్లబ్ ప్రతినిధి గవర సోమశేఖర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు వాకర్స్ క్లబ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ప్రతినిధులు మడగల నరసింగరావు, బెక్కం రామారావు, కరణం పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్



వేచి ఉన్న విద్యార్థుల కుటుంబ సభ్యులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ అయిన్ డిజిటల్ పరీక్షా కేంద్రంలో ఆదివారం జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. విద్యార్థులకు నిర్వాహకులు అన్ని రకాల తనిఖీలు నిర్వహించి అనంతరం పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. ఉదయం, మధ్యాహ్నం 520 మంది పరీక్షకు హాజరైనట్లు నిర్వాకులు తెలిపారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దత్తత దేవాలయం అంబికాబాగ్ సీతారామచంద్ర స్వామి ఆలయంలో గత నెల 30 నుంచి నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజున సాయంత్రం 6 గంటలకు స్వామికి ద్వాదశ ప్రదక్షిణలు, సర్వలోప ప్రాయశ్చిత్తం, శ్రీపుష్పయాగం నిర్వహించారు.

పిన్‌కోడ్ సమస్య తీరేదెన్నడు..?

- కేటాయించి 9 ఏళ్లు..
అమల్లోకి రావడానికి ఇంకెన్నాళ్లు..





అగనంపూడి సబ్‌పోస్టాఫీస్

అగనంపూడి : అగనంపూడి సబ్ పోస్టాఫీస్ పిన్ కోడ్ చిక్కుముడి నేటికీ వీడలేదు. గతంలో వడ్లపూడి సబ్‌పోస్టాఫీస్ పర్యవేక్షణలో అగనంపూడి బ్రాంచ్ పోస్టాఫీస్ కార్యకలాపాలు సాగించేది. దీంతో ఉత్తరాలు ఒకరోజు ఆలస్యంగా బట్వాడా జరుగుతుండడంతో స్థానికుల అభ్యర్థన మేరకు 2014లో అగనంపూడి సబ్ పోస్టాఫీస్ ఏర్పాటు చేశారు. అప్పట్లో 530053 పిన్‌కోడ్ నంబర్ కేటాయించారు. కానీ ఇది అమల్లోకి రాకపోవడంతో ఏళ్ల నుంచి పిన్‌కోడ్ ఇబ్బంది పెడుతోంది. అగనంపూడి బ్రాంచ్ పోస్టాఫీస్‌గా ఉన్న రోజుల్లో వడ్లపూడి పిన్‌కోడ్ నంబర్ ద్వారా పోస్టల్ లావాదేవీలు సాగేవి. ఇప్పుడు కూడా వడ్లపూడి సబ్‌పోస్టాఫీస్‌కు ఉత్తరాలు, ఇతర లావాదేవీలు చేరుకుంటున్నాయి. దీంతో మరుసటి రోజు వడ్లపూడి నుంచి అగనంపూడి సబ్‌పోస్టాఫీస్‌కు తీసుకువచ్చి స్థానికంగా బట్వాడా చేయాల్సి వస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా ఆధార్ కార్డులో అగనంపూడి పిన్ కోడ్ నంబర్ నమోదు చేసుకున్నా సదరు నంబర్ అమల్లోకి రాలేదనే సమాధానం వస్తుండడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు అంటున్నారు. అలాగే నిరుద్యోగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడం, పోస్టల్ ద్వారా దరఖాస్తు చేసుకునే యువత ఈ నంబర్‌ను అడ్రస్‌లో రాస్తే నాలుగు రోజులు ఆలస్యంగా కాల్ లెటర్లు, ఇతర ఉత్తరాలు అందుకోవల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు.

పిన్‌కోడ్ సమస్య పరిష్కరించాలి..

అగనంపూడి పిన్‌కోడ్ నంబర్ సమస్య పరిష్కరించాలి. ముఖ్యంగా యువత ఉద్యోగాలకు చేసుకునే దరఖాస్తుల్లో పిన్‌కోడ్ నంబర్ రాయాల్సి ఉంటుంది. పిన్‌కోడ్ కేటాయింపు లేక ఉత్తరాల బట్వాడాలో జాప్యం జరుగుతుంది. దీంతో నిరుద్యోగులు ఇబ్బంది పడాల్సి వస్తుంది.

జగదీశ్వరరావు, కొండయ్యవలస

9 సంవత్సరాలైనా అధికారులు స్పందించరా..

తొమ్మిది సంవత్సరాలు అయినా పిన్‌కోడ్ సమస్య పరిష్కారం కాకపోవడంలో అధికారుల నిర్లక్ష్యం బయట పడుతుంది. వడ్లపూడి పోస్టాఫీస్ ద్వారా పోస్టాఫీస్ వ్యవహారాలు సాగుతుండడం వల్ల జాప్యం జరుగుతోంది. దీనివల్ల స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.

రాజేష్, పెదమడక

ఉక్కు ఉద్యోగులకు వేతన ఒప్పందం చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న దొమ్మేటి అప్పారావు

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు తక్షణం వేతన ఒప్పందం చేయాలని స్టీల్ హెచ్‌ఎంఎస్ యూనియన్ అధ్యక్షుడు దొమ్మేటి అప్పారావు అన్నారు. ఈ నెల 3,4 తేదీల్లో మహారాష్ట్రలోని ఎన్‌యూఎస్‌ఐ ఆడిటోరియంలో స్టీల్ మెటల్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా హెచ్‌ఎంఎస్ ఇండస్ట్రియల్ ఆల్ గ్లోబెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అల్ సెయిల్ యూనిట్లలో వేతన ఒప్పందం చేశారని, ఆర్‌ఐఎన్‌ఎల్‌లో ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. అలాగే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. షీలానగర్ వద్ద ఈఎస్‌ఐ ఆస్పత్రిని నిర్మించాలన్నారు. నిర్వాసితులకు శాశ్వత ఉద్యోగాల కల్పించాలని, ఐరన్, ఓర్, కోల్ మైన్స్‌తో పాటు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక నిధి ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఎస్ఎన్ఈఎఫ్ఐ అధ్యక్షుడు ఎస్.త్యాగి, ప్రధాన కార్యదర్శి ఎన్‌జేసీఎస్ మెంబర్ వాడాకర్, రాజేంద్రసింగ్, శశిధర్ నాయక్, హెచ్ఎస్ మిశ్రా, డాక్టర్ శెట్టి శుశాంత్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

చర్చి సమస్య పోలీస్‌స్టేషన్‌కు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ హయ్యర్ మెమోరియల్ లూథరన్ చర్చికి గుంటూరుకు చెందిన ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ చర్చి (ఏఈఎల్‌సీ) సంఘం గతంలో ఒక పాస్టర్‌ను నియమించింది. సదరు పాస్టర్ రూ.25 లక్షలు నిధులు దుర్వినియోగం చేశారంటూ లూథరన్ చర్చి పెద్దలు గుంటూరు ఏఈఎల్‌సీ అధ్యక్షునికి ఫిర్యాదు చేశారు. అయితే తమ ఫిర్యాదును ఏఈఎల్‌సీ అధ్యక్షుడు పట్టించుకోకపోవడంతో ఏఈఎల్‌సీ నుంచి విడిపోయి స్వచ్ఛందంగా సంఘం పెట్టుకుని ప్రార్థనలు జరుపుకుంటున్నట్లు హయ్యర్ మెమోరియల్ చర్చి ప్రతినిధులు తెలిపారు. తమ సంఘానికి ఎవరినీ పాస్టర్‌గా నియమించవద్దని ఏఈఎల్‌సీకి తెలిపినా నూతనంగా ఓలివర్ అనే వ్యక్తిని పాస్టర్‌గా నియమించినట్లు తెలిపారు. అయితే దీనిని తాము అంగీకరించకపోవడంతో ఇటీవల ఓలివర్ పాస్టర్ అనుచరులు బెదిరిస్తూ, ఫోన్లు చేసి అసభ్య పదజాలంతో తిడుతున్నట్లు గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

క్లోమ వ్యాధిపై అవగాహన ముఖ్యం



జ్యోతి ప్రజ్వలనతో సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ సతీష్‌కుమార్

అక్కిరెడ్డిపాలెం: క్లోమ వ్యాధులపై షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సదస్సుకు ఢిల్లీ, చండీగఢ్, బెంగళూరు, హైదరాబాదు నుంచి ప్రముఖ వైద్యులు విచ్చేశారు. జరిగిన సదస్సులో ప్యాంక్రియాటిక్ వ్యాధులకు ఈయుఎస్, ఈఆర్‌సీపీ లాంటి అధునాతన ఎండోస్కోపిక్ పద్ధతుల్లో చేసే చికిత్స సత్ఫలితాలిస్తుందని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి చెందిన గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ ఆచంట చలపతిరావు తెలిపారు. మద్యపానం, ధూమపానం, పిత్తాశయంలో రాళ్ల వల్ల ప్యాంక్రియాటైటిస్, ప్యాంక్రియాటిక్ క్యాన్సర్లు ఎక్కువగా వస్తున్నాయన్నారు. కడుపులో ఏ సమస్య వచ్చినా దాన్ని గ్యాస్ట్రిటిస్ లేదా అజీర్ణం అని తప్పుగా అంచనా వేయడం వల్ల రోగ నిర్ధారణలో జాప్యం జరుగుతుందన్నారు. 500 మందికి పైగా వైద్యులు పాల్గొని ఈ రంగంలో వస్తున్న సరికొత్త మార్పులు, చికిత్సా విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ మురళీధర్ నంబాడ, షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ పి.సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాద బాధితులకు పింఛన్ సొమ్ము అందజేత



పట్టా రామ అప్పారావు

అగనంపూడి: ఒడిశా రైలు ప్రమాదంలో మృతి చెందిన బాధితులకు ఉక్కు విశ్రాంత ఉద్యోగి, సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు రూ.2700 పింఛన్ సొమ్మును సహాయంగా అందించారు. ప్రధానమంత్రి సహాయక నిధికి సొమ్మును చెల్లించినట్లు రామ అప్పారావు తెలిపారు. హృదయ విదారకరమైన సంఘటన ఎంతో బాధించిందని, ప్రతీ ఒక్కరూ మానవత్వంతో స్పందించాలని ఆయన తెలిపారు.

కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

సింధియా: కళలపై ఉన్న ప్రేమతో కళాకారులు ఇంకా సేవ అందిస్తున్నారని, అటువంటి మరుగున పడిన కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. జీవీఎంసీ 40వ వార్డు షిప్‌యార్డ్‌కాలనీలోని లలితకళామందిరంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంజయంతిని పురస్కరించుకుని లయమాధురి ఆర్కెస్ట్రాను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గణబాబు, 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గాన గాంధర్వుడు స్వర్గీయ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాకారులను సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం కళాకారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళలను, కళాకారులను గౌరవించి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఆర్కెస్ట్రా ఆహుతులు ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రోగ్రాం స్పాన్సర్ (జీఆర్‌కే)రవికుమార్, నాయకులు సాలాపు రామారావు, నిర్వాహకులు రౌతు బాబు, సూరాడ జోగారావు, ఆర్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న కార్పొరేటర్లు చందు, పూర్ణశ్రీ

గాజువాక : పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గాజువాక సెలెస్ట్‌వాసులు ఆదివారం మొక్కలు నాటారు. సెలెస్ట్ గేటు వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఉరుకూటి చందు, పూర్ణశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. సెలెస్ట్‌వాసులు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సెలెస్ట్ నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సత్యదేవుని ఆలయంలో పౌర్ణమి పూజలు



రమా సహిత సత్యనారాయణ స్వామి

డాబాగార్డెన్స్ : నగరంలోని ఇసుకకొండ (బాబాజీ కొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు. వేకువ జాము 4 గంటల నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. నగరం నుంచే గాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి తరలివచ్చారు. ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు జరిగాయి. ఆలయ ఈవో బుద్ద నాగ జగదీష్ పర్యవేక్షించారు. మండుటెండలకు భక్తులు అవస్థలు పడ్డారు. భక్తుల సౌకర్యార్థం సర్వదర్శనంతో పాటు ప్రత్యేక టికెట్లు అందుబాటులో ఉంచారు. మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. వేకువ జాము 4 గంటలకు అనివెట్టి మండపం వద్ద సామూహిక వ్రతాలు, ప్రత్యేక పూజలు జరిపారు. ధ్వజస్తంభ పూజలు జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు.

తీరంలో పర్యాటకుల సందడి

పరవాడ: తిక్కవానిపాలెం తీరం ఆదివారం పర్యాటకులతో సందడిగా మారింది. వారం రోజుల నుంచి ఎండ వేడిమితో ఉక్కిరిబిక్కిరవుతున్న పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన సందర్శకులు ఆదివారం ఉదయం తిక్కవానిపాలెం సముద్ర తీర ప్రాంతాల్లో సేద దీరడానికి తరలివచ్చారు. తీరంలోని ఎన్టీపీసీ జెట్టీ దిగువన వీస్తున్న చల్లని గాలులను ఆస్వాదిస్తూ ఆట పాటలతో సరదగా గడిపారు.


రైలు ప్రమాదంపై కాంగ్రెస్ దిగ్భ్రాంతి

డాబాగార్డెన్స్: ఒడిశా రైలు ప్రమాదం పట్ల కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోట వాసుదేవరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణమని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం మృతుల కుటుంబాలకు కనీసం రూ.25 లక్షలు, క్షతగాత్రులకు రూ.15 లక్షలు తక్కువ కాకుండా నష్టపరిహారం అందజేయాలన్నారు.

సంతాపం..

అల్లిపురం: రైలు ప్రమాదంలో అశువులు బాసిన వారికి వెంకటేశ్వరమెట్టలోని శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం సభ్యులు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా గ్రంథాలయం అధ్యక్షుడు భీశెట్టి శ్రీను మాట్లాడుతూ శుక్రవారం రాత్రి బాలాసోర్ వద్ద జరిగిన ఘోర రైలు ప్రమాదంలో 300కు ప్రయాణికులు అశువులు బాయటం విచారకరమన్నారు. వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తూ గ్రంథాలయ సభ్యులు ఆదివారం సమావేశమై మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఘనంగా రైతు పూజోత్సవం



రైతులను సత్కరిస్తున్న జేడీ ఫౌండేషన్ సభ్యులు

గోపాలపట్నం: ఏరువాక పౌర్ణమి సందర్భంగా గోపాలపట్నం జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతు పూజోత్సవాన్ని వేపగుంట సేనాపతి కాలనీ వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీ విజయ దుర్గ గోఆధారిత ప్రకృతి వ్యవసాయ క్షేత్రం వద్ద రైతులను సత్కరించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న రైతులు టి. సత్యనారాయణ, బొడ్డేటి అప్పారావు, ఏరువాక త్రినాథ్, కె. సంతోష్, కె. సూరిబాబు, జి. శ్రీనివాస్, పి. బాబూజీ, కె. సాంబమూర్తి, ఆర్. గౌరి నాయుడు, జి. ప్రసాద్, జగన్‌ను సత్కరించారు. దేశానికి రైతుల వెన్నుముఖగా నిలుస్తున్నారని వారిని గౌరవించాల్సి బాధ్యత ప్రతీ పౌరుడిపై ఉందని జేడీ ఫౌండేషన్ సభ్యుడు సాలాది కృష్ణయ్య అన్నారు. కార్యక్రమంలో పిన్నమనేని శ్రీనివాస్, బుద్దాల కృష్ణ మోహన్, పి. నాగేశ్వరరావు జేడీ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవి మండపం ప్రారంభం



మండప ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

గాజువాక : పాత కణితి గ్రామంలోని శివాలయంలో శ్రీని చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు నూతనంగా నిర్మించిన అన్నపూర్ణాదేవి మండపాన్ని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. అంతకు ముందు ఆలయం చుట్టూ ప్రతిష్ఠించిన 108 నందీశ్వరులకు ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణాదేవిని, నందీశ్వరులను ఎమ్మెల్యే సహా మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొండా జగన్, లేళ్ల కోటేశ్వరరావు, స్థానిక నాయకులు నడింపల్లి విజయరామరాజు, కోమటి రమాదేవి, బలిరెడ్డి నాగేశ్వరరావు, వడ్లపూడి ఈశ్వరరావు, కోనేటి పారిపల్లి, జెర్రిపోతుల ఈశ్వరరావు, మోదినాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ వెంకన్న ఆలయంలో గిరి ప్రదక్షిణ



ఉక్కు వేంకటేశ్వరస్వామి ఆలయంలో గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: సెక్టార్-1 వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం గిరి ప్రదక్షిణ జరిగింది. పౌర్ణమి సందర్భంగా ఉదయం ఆరు గంటలకు ఏర్పాటు చేసిన గిరి ప్రదక్షిణ ఆద్యంతం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, ఉదయ కృష్ణమాచార్యులు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందు వేకువజామున వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అణగదొక్కే ప్రయత్నం మానుకోవాలి



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం : విశాఖ ఉక్కును అణగదొక్కే ప్రయత్నాలు కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 843వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో పలు విభాగాల కార్మికులు పాల్గొని స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని కేంద్రం ఉపసంహరించుకున్నట్లు ప్రకటన చేయాలని, లేని పక్షంలో తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామన్నారు. ప్లాంట్‌లో పూర్తిస్థాయి ఉత్పత్తి అమలు కావడానికి ముడిసరకుల నిల్వలు పెంచాలని, కార్మిక వర్గానికి నూతన వేతన సవరణ ప్రకారం జీతాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాలు, ఇతర కార్మిక సంఘాలతో సమావేశాలు నిర్వహించి, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విజయ కనకదుర్గ అమ్మవారి పండగ



అమ్మవారి ఘటాలు మోస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి

గాజువాక : జీవీఎంసీ 65వ వార్డు వాంబేకాలనీలో వెలసిన శ్రీ విజయ కనక దుర్గ అమ్మవారి పండగ అంగరంగ వైభవంగా మొదలయింది. మొదటి రోజు అమ్మవారికి మంగళ స్నానాలతో సంబరాలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గాజువాక వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి తిప్పల దేవన్‌రెడ్డి, 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు, 64వ వార్డు ఇన్‌చార్జి ధర్మాల శ్రీను పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారికి మంగళ స్నానాలు చేయించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గొల్లపల్లి రాంబాబు, మద్దాల అప్పారావు, లోకనాథరావు, నాగిశెట్టి శ్రీను, విరోతి గణేష్, సింగంపల్లి దేముడు, జుత్తు లక్ష్మీ, కొలంటి దేవి, పుప్పల పుష్ప, రూప, సుందరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు అంబేడ్కర్



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, చిన్నారులు

మల్కాపురం: ఆదర్శమూర్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని.. విద్యార్థి దశలోనే అంబేడ్కర్ గురించి నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు వై.హరిబాబు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. స్వేచ్ఛ,సమానత్వం,న్యాయం మొదలైన విషయాలను ప్రతి విద్యార్థి అవగాహన చేసుకోవాలన్నారు. ప్రతి మనిషిని గౌరవంతో సమానంగా ఆదరించాలన్నారు. బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎం.మల్లయ్యరాజు మాట్లాడుతూ గొప్ప పుస్తకాలను పఠించటం వల్ల చిన్నారులకు మంచి విజ్ఞానం కలుగుతుందన్నారు. పలువురిలో ఎలా మసులు కోవాలి.. పది మందికి ఏ విధంగా సాయం అందించగలమో తెలుస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ జీవిత చరిత్రపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి అతిథుల చేతుల మీదుగా జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో రచయిత సత్తిరాజు,కార్మిక సంఘ నాయకుడు బి.సత్యానందం, జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి మోదకొండమ్మ ఉత్సవాలు



ఆలయ ప్రాంగణంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న బెహరా విజయ చైతన్య, ఆలయ కమిటీ సభ్యులు

గోపాలపట్నం: గోపాలపట్నం ఇందిరానగర్, లక్ష్మీనగర్ పరిసర ప్రాంతాల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న మోదకొండమ్మ అమ్మవారి మహోత్సవాలను ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉత్సవాల పోస్టర్‌ను ఆలయ ప్రాంగణంలో ఆదివారం బెహరా విద్యా సంస్థల డైరెక్టర్ బెహరా విజయ చైతన్య, స్థానిక నాయకుడు బాలసుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా ఖ్యాతి గాంచిన అమ్మవారు మోద కొండమ్మ అమ్మవారని తెలిపారు. వైభవంగా నిర్వహించనున్న పండగకు భక్తులందరూ సహకరించాలని కోరారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు విల్లూరి ప్రకాష్, కోనేటి నూకరాజు మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 20 వరకు పండగ జరుగుతుందని తెలిపారు.18న పుట్టబంగారం తీత, 19న తొలేళ్ల పండగ, సారె ఊరేగింపు, 20న ప్రధాన పండగ జరుగుతుందని చెప్పారు. అందుకు తగిన విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జులై 18న నెల పండగ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆరోజు భారీ అన్న సమారాధన జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి కృష్ణ, సత్తిరాజు, అప్పలస్వామి, దొడ్డి రాము, కుమార్, గణేష్, ఐమంది శ్రీను, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.